క్లుప్తంగా

సచివాలయం ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల సచివాలయాన్ని స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ఇంటి పన్ను, నీటిపన్ను, ట్రేడ్ లైసెన్సులపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే అర్జీలపై సత్వరమే స్పందిచాలని సిబ్బందికి సూచించారు. అన్నాక్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

మానవతకు సభ్యత్వ నగదు అందజేత


రశీదులు అందజేస్తున్న హనుమంతురావు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోందని జిల్లా కన్వీనర్ కె.యల్లమందారెడ్డి చెప్పారు. ఐలా హనుమంతరావు తన కుమారుడు వెంకటేష్ వివాహం సందర్భంగా సభ్యత్వ నమోదు కింద రూ.10 వేల నగదును యల్లమందారెడ్డికి అందజేశారు. బంధువులకు, కుటుంబ సభ్యులకు మానవత సభ్యత్వం ఇప్పించారు. వీరికి యల్లమందారెడ్డి అభినందనలు తెలిపారు.

పంట నమోదు జాబితాను సరిచూసుకోవాలి


జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ మెర్సీ

బేస్తవారిపేట: రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన పంట నమోదు జాబితాను రైతులు సరిచూసుకోవాలని వ్యవసాయాధికారిని జక్కం మెర్సీ సూచించారు. మండలంలోని చెట్టిచర్లలో ఈ క్రాఫ్ బుకింగ్ జాబితాను రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం ప్రదర్శించారు. జాబితాలో ఏమైనా తప్పులుంటే ఆర్‌బీకేలోని సిబ్బందికి తెలపాలని కోరారు. ఈ నెల 16వ తేదీలోపు సవరణకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు మంచి సేవలందించాలి


వివరాలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి

మార్కాపురం: దివ్యాంగ విద్యార్థులకు మంచిసేవలు అందించాలని మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి డి.దేవేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఉన్న స్ఫూర్తి మానసిక రుగ్మత ఆశ్రమాన్ని ఆయన గురువారం సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. దివ్యాంగ విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి సకాలంలో సాయం చేయాలన్నారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు ఇప్పించాలని కోరారు. ఈయన వెంట న్యాయవాదులు ఏ.ఉషశ్రీ, రోజ్‌లిడియా, ఆశ్రమ ఇన్‌చార్జి అనిత పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా మార్కాపురం జిల్లా ప్రకటన

మార్కాపురం: ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకూ అలాంటి ప్రయత్నాలు చేయకపోవడం శోచనీయమని మార్కాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ గురువారం అన్నారు. ఎన్డీఏ కూటమిని ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు మార్కాపురం జిల్లా చేస్తారన్న ఆశతో గెలిపించారని, అయితే బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాల ప్రకటన ఇప్పుడే లేదని ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలు మోసపోయారన్నారు. ఇప్పటికైనా మార్కాపురాన్ని జిల్లా చేయాలని ఆయన కోరారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న కందుల ప్రమీలాదేవి

మార్కాపురం టౌన్: దుర్గాష్టమి పండగను పురస్కరించుకుని కందుల ఓబులరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది 100 మంది పేదలకు దుస్తులను కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి సతీమణి ప్రమీలాదేవీ, ఆయన కుమారుడు డాక్టర్ కందుల గౌతమ్‌నాగిరెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కందుల గౌతమ్ నాగిరెడ్డి మాట్లాడుతూ విజయదశమి పండగ ప్రజలందరికీ మంచి జరగాలని, పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. వైద్యశాల సిబ్బంది మహిళలకు చీరెలు, పురుషులకు వస్త్రాలు అందజేశారు.

విద్యతో పాటు కరాటేలోనూ ప్రతిభ



పట్టణానికి చెందిన కె.మహితారెడ్డి కేంద్రీయ విద్యాలయంలో 5వ తరగతి చదువుతోంది. విద్యతో పాటు కరాటే ప్రతిభ చూపుతుంది. రెండేళ్లుగా రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొని గోల్డుమెడల్ సాధిస్తోంది. జాతీయ స్థాయిలో జరిగే కరాటే పోటీలకు ఎంపికైంది. గతేడాది బాపట్ల, ఈ ఏడాది చెన్నైలో జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో పాల్గొని గోల్డు మెడల్ సాధించింది. ఇక మార్కాపురం, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. తండ్రి డాక్టర్ రఘు ఫీజియోథెరపిస్టుగా పనిచేస్తున్నారు.

కె.మహితారెడ్డి, మార్కాపురం



మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ యాసీన్‌బాషా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల నుంచి పట్టణంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్లో శిక్షణ పొందుతున్నాడు. గతేడాది చెన్నైలో జరిగిన సౌత్ జోన్ కరాటే పోటీల్లో బ్రాంజ్ మెడల్‌ను, వైజాగ్‌లో జరిగిన పోటీల్లో గోల్డు మెడల్‌ను, జమ్మూ కశ్మీర్‌లో, రాజస్థాన్‌లో, చిత్తూరులో జరిగిన పోటీల్లో గోల్డు మెడల్ సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఎస్‌కే యాసీన్‌బాషా, మార్కాపురం



మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ మహ్మద్ షాకీర్‌బాషా 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన సౌత్ జోనల్ స్థాయి పోటీల్లో 3 మెడల్స్‌ను, పార్వతీపురం, రాజస్థాన్, చిత్తూర్‌లలో జరిగిన అంతర్‌రాష్ట్ర కరాటే పోటీల్లో సిల్వర్, గోల్డు మెడల్స్ సాధించి త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

షేక్ మహ్మద్ షాకీర్ బాషా, మార్కాపురం

కరాటే..ఈ పేరు వింటేనే ఓ రకమైన ధైర్యం.. ఆత్మవిశ్వాసం.. వస్తుంది. మనం ఎక్కడైనా కరాటే నేర్చుకునే పిల్లలు కనిపిస్తే తల తిప్పకుండా వారినే చూస్తుంటాం..అది కరాటేకు ఉన్న క్రేజ్. ఆత్మరక్షణతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంచేందుకు కరాటే ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అటుగా వెళ్తున్నప్పుడు గట్టిగా ఎవరైనా అరుస్తూ పిల్లలను క్రమశిక్షణలో పెడుతున్నారంటే అక్కడ కరాటే క్లాస్ జరుగుతున్నట్టు లెక్క. కరాటే మాస్టర్ ఓస్.. అనగానే పిల్లలందరూ నమస్కారం పెడతారు. ఎమే..అనగానే ఆగిపోతారు.





- అన్ని ప్రాంతాల్లో విజేతలు వీరే
- తలపడితే మెడల్స్ సాధించాల్సిందే

మార్కాపురం:

నేర్చుకునే విద్యను ఏదో నేర్చుకున్నామని కాకుండా పట్టుదలతో ప్రాక్టీస్ చేస్తూ తోటి విద్యార్థులకన్నా మిన్నగా రాణిస్తూ కరాటే విభాగాల్లో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మార్కాపురం పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు. విద్యతో పాటు ఏదో ఒక క్రీడలో ప్రతిభ చూపితే విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించినట్లే. కేవలం విద్యకే పరిమితమైతే మార్కులు, ఉద్యోగం తప్పితే శారీరక, మానసిక అభివృద్ధి, ఆశించిన స్థాయిలో రాణించలేరు. విద్యార్థి దశలో విద్యతో పాటు తమకు నచ్చిన ఏదో ఒక క్రీడలో పాల్గొని నైపుణ్యం సాధించి అవార్డులు, మెడల్స్ సాధించినప్పుడే ఆ విద్యార్థికి ఆనందం వస్తుంది. తాను నేర్చుకున్న విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించడంతో పాటు తమకు ఆత్మరక్షణగా ఉంటుంది. మార్కాపురం ప్రాంత విద్యార్థులు మావోతే కా షిటోరియా కరాటే స్కూల్ శిక్షకులు బ్లాక్ బెల్ట్ 6వ డాన్ శ్రీనివాస రెడ్డి, బ్లాక్ బెల్ట్ 4వ డాన్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు కరాటే నేర్చుకుని జిల్లా, రాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి మెడల్స్ సాధిస్తున్నారు.

20 ఏళ్ల నుంచి శిక్షణ ఇస్తున్నా:



మార్కాపురం పట్టణంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ ఏర్పాటు చేశా. సుమారు 1000 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ ఇచ్చా. నా దగ్గర శిక్షణ పొందిన వారిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించిన వారు ఉన్నారు. ఈ ఏడాది జైపూర్‌లో జరిగిన మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నా దగ్గర శిక్షణ పొందిన 8 మంది విద్యార్థులు గోల్డు మెడల్ సాధించారు. 2022లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా మార్కాపురం విద్యార్థులు గోల్డు మెడల్ సాధించారు.

శ్రీనివాసరెడ్డి, కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, 6వ డాన్

పదేళ్ల నుంచి ప్రత్యేక శిక్షణ:



కరాటేతో ఆత్మరక్షణతో పాటు ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతుంది. పదేళ్లుగా వందలాది మంది విద్యార్థులకు కరాటే కోచ్‌గా శిక్షణ ఇచ్చా. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదొక ఆత్మరక్షణ విద్య నేర్పిస్తే భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆడపిల్లలకు కరాటే ఆత్మరక్షణగా ఉపయోగపడుతుంది.

తోట ప్రసాద్, కరాటే కోచ్, మార్కాపురం

పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం


మాట్లాడుతున్న ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పడుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పక్కా గృహాలకు బిల్లులు మంజూరు చేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇష్టారాజ్యంగా దొంగ హాజరు వేస్తున్నారని, ప్రైవేట్ నర్సరీలలో అధిక ధరలకు మొక్కలు అమ్ముతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రాజయ్య, తహసీల్దార్ జితేంద్ర కుమార్, ఎంపీడీఓ రంగనాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకంభం సర్పంచ్ రసూల్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశాల్లో సభ దృష్టికి ఎన్ని సమస్యలు తీసుకొచ్చినా పరిష్కారం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కోఆప్షన్ సభ్యుడు సలీం మాట్లాడుతూ అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పట్టణంలో కుక్కల బెడద అధికమవుతోందని, కంభం పంచాయతీలో కుక్కలను పట్టించారని కందులాపురంలో ఎందుకు పట్టించడంలేదని ప్రశ్నించారు. దీంతో కుక్కల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

టెండర్‌లో షాపు దక్కితే ప్రశాంతంగా వ్యాపారం


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

పొదిలి: మద్యం దుకాణాలకు సంబంధించి టెండర్‌లో దుకాణం దక్కించుకున్న వారు ప్రశాంతంగా వ్యాపారం చేసుకోవచ్చని అసిస్టెంట్ కమిషనర్ విజయ చెప్పారు. గురువారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం పాలసీలో విధి విధానాలను, వచ్చిన దరఖాస్తులపై ముందుగా అధికారులతో మాట్లాడారు. మీడియాతో మాట్లాడుతూ దుకాణాలకు దరఖాస్తులు చేసుకునే విషయంలో ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. ఎటువంటి బెదిరింపులకు అవకాశం ఉండదన్నారు. పాలసీ విజయవంతం చేసేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన మద్యం దుకాణాలు ప్రారంభించిన తర్వాత బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎటువంటి అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ జనార్దనరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నరహరి, రామారావు, పొదిలి సీఐ అరుణకుమారి, ఎస్సై సైమన్ పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

పొదిలి: భారతదేశం గర్వించదగిన పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కష్ట సమయాల్లో ఉన్న ప్రజలను మహాదాతగా ఆదుకున్న మానవతావాది టాటా అని కొనియాడారు. దేశభక్తి కలిగిన, ఆదర్శనీయుడైన ఒక మహా వ్యక్తిని దేశం కోల్పోయిందని, ఆయనకు భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించడమే ఆయనకు జాతి ఇచ్చే ఘన నివాళిగా సైదా తెలిపారు.

మద్యం షాపులకు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలి

- పది కన్నా తక్కువ దరఖాస్తులు వస్తే రీ టెండర్లు
- ఎక్సైజ్ ఏఈఎస్ బాలయ్య


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏఈఎస్ బాలయ్య

మార్కాపురం: నూతన ఎక్సైజ్ పాలసీ ద్వారా మద్యం షాపులకు వ్యాపారులు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని మార్కాపురం ఎక్సైజ్ ఏఈఎస్ దాసరి బాలయ్య భరోసా ఇచ్చారు. ఆయన గురువారం తన కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఒక్కో షాపునకు పదికన్నా తక్కువ దరఖాస్తులు వస్తే వాటిపై విచారణ నిర్వహించి ఇంటలిజెన్స్ సమాచారం తెప్పించుకుంటామని, ఎవరైనా సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేయకపోతే తాము ప్రభుత్వానికి నివేదిక పంపి రీటెండర్ పిలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ మద్యం వ్యాపారం చేసిన వారు తిరిగి మద్యం వ్యాపారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వ్యాపారులకు లాభాలు ఉండే విధంగా 20 శాతం వరకూ కమీషన్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దరఖాస్తుదారులు రాకుండా ఎవరైనా సిండికేట్‌గా వ్యవహరిస్తే ఇంటెలిజెన్సీ నిఘా వర్గాల ద్వారా వారిని గుర్తించి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, గౌస్‌బాషా పాల్గొన్నారు.

మార్కాపురం సర్కిల్లో 253 దరఖాస్తులు

మార్కాపురం ఎక్సైజ్ పరిధిలోని మార్కాపురం టౌన్, రూరల్, దోర్నాల, పెద్దారవీడు మండలాలకు సంబంధించి గురువారం సాయంత్రానికి 253 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రంతో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందని తెలిపారు.

అసైన్డ్, అండర్ అసైన్డ్ భవనాలకు పన్నులు వేయించుకోవాలి


మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో అన్ అసైన్డ్, అండర్ అసైన్డు భవనాలను గుర్తించి పన్నులు వేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు సూచించారు. గురువారం పురపాలక సంఘంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి భవనాలకు పన్నులు వేయాలని సూచించారు. పట్టణ పరిధిలో పన్నులు వేయని భవనాలను, అదనపు నిర్మాణాలకు పన్నులు వేయించుకోదలచిన వారు సంబంధిత డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డులు, ధ్రువీకరణ పత్రాలతో సచివాలయ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు అందజేయాలని ప్రజలను కోరారు. వివరాల కోసం సచివాలయం, పురపాలక సంఘంలో రెవెన్యూ విభాగంలో సంప్రదించాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న సీఐ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కంభం: బాలకార్మిక, వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కంభం సీఐ మల్లికార్జునరావు కోరారు. గిద్దలూరు న్యాయసేవాధికార సంస్థ, సాంఘిక సంక్షేమశాఖ, సార్డ్స్ సంస్థ, లార్డ్స్ సంస్థ, రీడ్, స్పీడ్ సంస్థల ఆధ్వర్యంలో పోలీసులు, కార్మిక శాఖాధికారులు కలిసి గురువారం ఆపరేషన్ స్వేచ్ఛ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు బేకరీలు, ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బాలకార్మికులు, మానవ అక్రమ రవాణా బాధితులు, వెట్టి చాకిరీ వ్యవస్థ బాధితులను గుర్తించి సమాచారం ఇవ్వాలని కోరారు. బాలకార్మికులను గుర్తించి వారికి పునరావాసం కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో బాలబాలికలను పనుల్లోకి తీసుకోవడం నేరమని, అటువంటి వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వీరభద్రాచారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై బి.నరసింహారావు, సహాయకార్మిక శాఖాధికారి జి.బాలకాశీనాయక్, కత్తి అనోజిరావు, యోబు, శ్రీను, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి, మార్కాపురంలో వర్షం


మార్కాపురంలో కురుస్తున్న వర్షం


రెండు కాలువలుగా ప్రధాన రహదారి


కొమరోలులోని గోపాలునిపల్లె రహదారిపై నిలిచిన వర్షం నీరు

పొదిలి: పొదిలిలో గురువారం ఉదయం నుంచి జల్లులు జల్లులుగా వర్షం కురిసింది. సాయంత్రం సమయానికి పెద్ద వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అంజనేయస్వామి ఆలయం వద్ద, ఎంపీడీఓ కార్యాలయం వద్ద, అడ్డరోడ్డు వద్ద, పెద్ద మసీదు, పెద్ద బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, తహసీల్దార్ కార్యాలయం ఆవరణ, నేతపాలెం, చిన్న బస్టాండ్ సెంటర్‌లో పలు చోట్ల వర్షం నీరు నిలిచింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు తొలగించిన ఆక్రమణల వద్ద మట్టి జారుతుండటంతో వాహనదారులు అదనంగా సమస్య ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై వర్షం నీరు చేరటం, పక్కనే సైడు కాలువల్లో వర్షం నీరు, మురుగు నీరు కలిసి ప్రవహిస్తుండటంతో చూసే వారికి అవి రెండు కాలవల్లా కనిపిస్తున్నాయి. సాగు చేసిన పైర్లతో పాటు, పొగనాట్లకు మంచి అదును వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు.

మార్కాపురంలో కూడా..

మార్కాపురం: పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓ మోస్తరు వర్షం కురిసింది. వారం రోజుల నుంచి విపరీతమైన ఎండల వేడికి, ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు గురువారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం పత్తి, మిర్చి, కంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో రబీ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం

కొమరోలు: చిన్నపాటి వర్షం కురిసినా కొమరోలులో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. గురువారం మధ్యాహ్నం 5 నిమిషాలపాటు చిన్నపాటి వర్షం కురిసింది. ప్రధాన రహదారిలో, గోపాలునిపల్లె రహదారిలో సైడు కాలువలు లేకపోవడంతో వర్షం నీరంతా రోడ్లపైనే నిలిచిపోయింది. ఇంత చిన్నపాటి వర్షానికే రహదారులన్నీ నీటితో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు రహదారులకు ఇరువైపులా సైడు కాలువలు నిర్మించి వర్షం నీరు వెళ్లిపోయేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు


గొట్లగట్టు రామాలయంలో..


సోమవారిపేటలో శ్రీమహాదుర్గా దేవిగా చౌడేశ్వరీదేవి


బేస్తవారిపేట : మహిషాసుర మర్దినిగా కోటసత్యమాంబదేవి

కొనకనమిట్ల: మహా కనకదుర్గ.. విజయ కనక దుర్గ.. అంటూ దసరా మహోత్సవాలు ఎనిమిది రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకుని మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకమిట్ల రామదూత క్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మగుడి, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి కుంకుమార్చనలు వేడుకగా జరిపించారు. పూజా కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.